క్లుప్తంగా

వెయిట్ లిఫ్టర్‌కు ఎమ్మెల్యే అభినందనలు



వెయిట్‌లిఫ్టర్ వీరేష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ డీజీ వీరేష్‌ను ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆదివారం అభినందించారు. తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొని డిజి. వీరేష్ 115 కేజీల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభను కనపరచి పతకాన్ని సాధించారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రాణించాలని తెలిపారు. క్రీడలు వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. రాష్ట్రస్థాయిలో రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన డీజీ వీరేష్‌కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావటం చాల సంతోషంగా ఉందన్నారు. డీజీ అంజినయ్య, డీజీ.ఈరన్న ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



జిల్లాస్థాయి బేస్ బాల్ సమ్మర్ కోచింగ్‌ను ప్రారంభించిన దృశ్యం

గోనెగండ్ల : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీటీసీ లోక్‌నాథ్ రెడ్డి, పీఈటీ మాస్టర్ కల్యాణి అన్నారు. మండలంలోని పెద్ద నేలటూర్ గ్రామంలో ఆదివారం జిల్లా స్థాయి బేస్ బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంపును ప్రారంభించారు. ఉచిత కోచింగ్ సెంటర్‌ను మే నెల చివరి వరకు కొనసాగిస్తామని తెలిపారు. జిల్లాలోని ఎక్కడి నుంచి అయినా విద్యార్థులు వచ్చి శిక్షణ పొందవచ్చన్నారు. ప్రస్తుతం ఈ కోచింగ్ సెంటర్‌కు చాగలమర్రి, ఆస్పరి, రాళ్లదొడ్డి, డి.కోటకొండ, పెద్దనేలటూర్ గ్రామాలకు చెందిన 16 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని చెప్పారు.

మురళీధర్‌రెడ్డికి సీఎం జగన్ పరామర్శ

పత్తికొండ రూరల్ : స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఫోనులో పరామర్శించారు. కొన్ని నెలల క్రితం పి.మురళీధర్‌రెడ్డి తండ్రి వాసుదేవరెడ్డి మృతి చెందగా, మూడు రోజుల కిందట తల్లి నాగలక్ష్మమ్మ అనారోగ్యంతో కన్నుమూశారు. సంవత్సర కాలంలోనే తల్లిదండ్రులిద్దరినీ కోల్పోవడం బాధాకరమని సీఎం విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి తన సంతాపం తెలిపారు.

9 నుంచి జగనన్నకు చెబుదాం

ఆలూరు: వైఎస్సార్‌సీపీ అధినాయకుల సూచన మేరకు ఈనెల 9వ తేదీ నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఆలూరు మండలం బెళ్లగుండ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం జరిగిన వివాహ వేడుకలకు హాజరైన ఆయన నూతన వధూవరులను ఆశ్వీరాదించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం హాజరు కానున్నట్లు తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు హాజరు కావాలని కోరారు.

కో ఆప్షన్ మెంబర్‌కు పరామర్శ



కోఆప్షన్‌మెంబర్ రావూఫ్‌ను పరామర్శిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

గోనెగండ్ల : మండల పరిధిలోని పెద్దనేలటూర్ గ్రామానికి చెందిన కోఆప్షన్ మెంబర్ రావూఫ్‌ని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. రావూఫ్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన కాలు విరిగింది. విషయం తెలుసుకున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి ఆదివారం పెద్దనేలటూర్ గ్రామంలో రావూఫ్ స్వగృహానికి వెళ్లి పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డి. నజీర్ అహమ్మద్, జహంగీర్, యూకే రాజు తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



తల్లిదండ్రులతో సి.జి ప్రభాకర్ (573) | మాల నవీన్ కిరణ్ (570)



జి.సాయి కుమార్ (569) | డి.సిరాజుద్దీన్ (565) | ఎన్.సూర్య ప్రకాశ్ (558)



ఎస్.అశ్రఫ్ బాషా (558) | బి.భీముడు (557) | కిషోర్ 532



మెర్సీ స్ఫూర్తి (522) | బిందు (518) | ఇల్లూరు జగదీష్ గుప్త (505)



ఎ.కె.జయశ్రీ (563) | జె. శేఖర్ (569) | వీరమణికంఠ (568)

- ప్రైవేటు స్కూళ్లకు దీటుగా అత్యధిక మార్కులు
- పత్తికొండ బాలుర గురుకులంలో వంద శాతం ఉత్తీర్ణత

పత్తికొండ రూరల్ : పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ సత్తా చాటారు. అత్యధిక మార్కులు సాధించడంలో ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోమని నిరూపించారు. మండలంలో 17 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు 987 మంది పది పరీక్షలు రాయగా శనివారం వెలువడిన ఫలితాల్లో 552 మంది విద్యార్థులు పాస్ కావడంతో 55.93శాతం నమోదైంది. బాలుర గురుకులం విద్యార్థులు 71 మందిలో 69 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్‌లో పాస్‌కాగా ఇద్దరు మాత్రం సెకెండ్ క్లాస్‌లో ఉత్తీర్ణులై వందశాతం ఫలితాలు సాధించారు. 500పైన మార్కులు సాధించిన విద్యార్థులు 32 మంది ఉన్నారు. ఏడుగురు విద్యార్థులు 550పైన మార్కులు సాధించారు. వారిలో సి.జి ప్రభాకర్ (573), మాల నవీన్ కిరణ్ (570), జి.సాయికుమార్ (569), డి.సిరాజుద్దీన్ (565), ఎన్.సూర్యప్రకాశ్ (558), ఎస్.అష్రఫ్ బాషా (558), బి.భీముడు (557) ఉన్నారు. అలాగే ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థిని నవీన (572), ఏపీఆర్ బాలికల గురుకులంలో ఎం.ఆశాజ్యోతి (542), ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జె.రాజేష్ (534), కస్తూరిబా పాఠశాలలో మల్లిక (518), జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో కె.సుష్మ జయని (504) మార్కులతో ఆయా పాఠశాలల టాపర్లుగా నిలిచారు.



ఎమ్మిగనూరు టౌన్‌టాపర్ నీలి ఉషోదయ (581)కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

రైతు ఇంట విద్యాకుసుమం

రైతు కుటుంబం ఇంట విద్యాకుసుమం మెరిసింది. పత్తికొండలోని బాలుర గురుకులంలో చదువుతున్న మండల పరిధిలోని పందికోన గ్రామానికి చెందిన చిన్నగొల్ల రంగస్వామి, సుంకులమ్మల కుమారుడు సి.జి.ప్రభాకర్ 573 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన విద్యార్థి పది ఫలితాల్లో సత్తా చాటాడు. డాక్టర్ అయి పేదలకు వైద్య సేవలందించడమే తన లక్ష్యమని విద్యార్థి తెలిపాడు. విద్యార్థిని గ్రామస్తులు అభినందించారు.

పదిలో మెరిసిన విద్యా కుసుమాలు

మద్దికెర : పదవ తరగతి ఫలితాల్లో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన మెర్సీ స్ఫూర్తి 522, బిందు 518 ఆదర్శ పాఠశాలకు చెందిన ఇల్లూరు జగదీష్ 505 మార్కులు సాధించారు. ఏకాగ్రతతో చదువుకుంటే ఎలాంటి పరీక్షలలో నైనా విజయం సాధించవచ్చని నిరూపించడమే గాకుండా తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. మండలంలో ఆరు ఉన్నత పాఠశాలలున్నాయి. అందులో మద్దికెరలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల 80.36 ఉత్తీర్ణత శాతం సాధించగా పెరవలి జిల్లా పరిషత్ హైస్కూల్ కేవలం 45.16 ఉత్తీర్ణత శాతం సాధించింది.

మండల టాపర్‌గా ఎస్సీ హాస్టల్ విద్యార్థి

తుగ్గలి : పదో తరగతి పరీక్షల్లో జొన్నగిరి ఎస్సీ హాస్టల్ విద్యార్థి కిషోర్ 532 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. కృష్ణగిరి మండల కటారుకొండకు చెందిన రామాంజినేయులు సుజాత కుమారుడు కిషోర్ ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివాడు. తల్లిదండ్రులు బతుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు. హాస్టల్‌లో మొత్తం 20 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 18 మంది ఉత్తీర్ణత సాధించారు. మండల టాపర్‌తో పాటు, ఫస్ట్‌క్లాస్‌లో 9 మంది, సెంకడ్ క్లాస్‌లో ఆరుగురు, థర్డ్‌క్లాస్‌లో ముగ్గురు ఉత్తీర్ణత సాధించారు. మండల టాపర్‌ను హాస్టల్ వార్డన్ వెంకటరాముడు అభినందించారు.

సత్తా చాటిన పేదింటి బిడ్డలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మాచాని సోమప్ప జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతూ ఎన్‌సీసీలో రాణిస్తూ పది పరీక్షల్లో సత్తా చాటుకున్నారు పేదింటి అమ్మాయిలు. పట్టణానికి చెందిన ఎస్. ఉషోదయ అనే విద్యార్థిని 581 మార్కులు సాధించి పట్టణంలోని ప్రభుత్వ హైస్కూళ్లలో టాపర్‌గా నిలిచింది. ఈ విద్యార్థిని తండ్రి భీమేష్ వృత్తి రీత్యా టైలర్ కాగా తల్లి శారద గృహిణి. కాగా ఇదే పాఠశాలలో 563 మార్కులతో కె.జయశ్రీ అనే విద్యార్థిని ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈమె తండ్రి వెంకటేష్ హోటల్ హోటల్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకొంటున్నాడు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధించి తల్లిదండ్రులకు అండగా నిలవాలన్నదే తన లక్ష్యమని ఆమె పేర్కొంది.

పదిలో విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

నందవరం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. మండలంలోని నాగలదిన్నె జెడ్పీ పాఠశాలకు చెందిన జె. శేఖర్ 569 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచాడు. మండలంలో రెండో స్థానంలో మండల కేంద్రం నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వీర మణికంఠ 568) మార్కులు, మూడవ స్థానంలో ముగతి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి ఎంబీ గోవిందు 563 మార్కులు సాధించాడు. అలాగే నందవరం జెడ్పీ పాఠశాలలో వీరమణికంఠ 568 మార్కులు, మానస 551, భారతి 537 సాధించారు. నాగలదిన్నె ఉన్నత పాఠశాలలో జె. శేఖర్ 569, బి. కల్యాణ్‌రామ్ 558, ఫహీంబాషా 480, ఏపీ మోడల్ స్కూల్‌లో ఎంబి గోవిందు 563, ఎస్. మహబూబ్ 528, కనకవీడు జెడ్పీ పాఠశాలలో సి. క్రాంతికుమార్ రెడ్డి 515 మార్కులు సాధించారు. ఇబ్రహీంపురం ఉన్నత పాఠశాలలో 501 మార్కులు, ముగతి జెడ్పీ పాఠశాలలో బి.ఉషా 533 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

పదిలో ప్రభుత్వ జెడ్పీహైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఆలూరు: ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్లో చదివిన విద్యార్థులు పది పబ్లిక్ పరీక్షలలో ఫలితాల్లో ఉత్తమ గ్రేడ్స్‌ను సాధించి తమ ప్రతిభ చాటారు. ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఉన్న మోడల్ స్కూల్లో పది పబ్లిక్‌లో తస్లీమా విద్యార్థిని 563 మార్కులు, దేవనకొండ మండలం తెర్నెకల్ గ్రామ జెడ్పీ హైస్కూల్లో లిఖితా రెడ్డి 539, అరికెర ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ పాఠశాల విద్యార్థి ధనుంజయరెడ్డి 538 మార్కులు సాధించారు. దేవనకొండ మండలం కరివేముల గ్రామ జెడ్పీ హైస్కూల్ నుంచి బోయ అఖిల్ 451, పి.కోటకొండ గ్రామ జెడ్పీ హైస్కూల్ విద్యార్థినికి బి. హరికృష్ణకు 535 మార్కులను సాధించారు.

హొళగుంద మండల టాపర్లుగా బాలికలు

హొళగుంద: ఇటీవల జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో హొళగుంద మండలానికి చెందిన విద్యార్థినీలు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మండల టాపర్‌గా హొళగుంద ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టి.శ్రావణి (569) నిలిచింది. కాగా కావాలన్నిది తన కోరిక అని వెల్లడించింది. రెండో స్థానంలో సుళువాయి పాఠశాలకు చెందిన యు.పుష్పావతి (557), మూడో స్థానంలో హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కప్పట్రాళ్ల లావణ్య (547) నిలిచారు. హొళగుంద, హెబ్బటం, ఇంగళదహాళ్, గజ్జహళ్లి, సుళువాయి, ఎల్లార్తి, హొళగుంద కేజీబీవీకి చెందిన మొత్తం 599 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగ అందులో 311 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైయ్యారు. ఇందులో బాలికలే మంచి మార్కులు సాధించారు.

బాలికలదే పైచేయి

వెల్దుర్తి: పదో తరగతి ఫలితాల్లో గురుకులాలు, కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అధిక మార్కులు సాధించి ప్రతిభ చాటారు. వెల్దుర్తి జ్యోతిబాపూలు బీసీ బాలికల గురుకులం విద్యార్థిని కె పావని 564 మార్కులతో మండలం టాపర్‌గా నిలిచింది. బాలికల జెడ్పీ హైస్కూల్ బాలికలు బి పల్లవి, జి భార్గవి 561 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. కాగా వెల్దుర్తి బాలికల హైస్కూల్ విద్యార్థిని త్రివేణి 555, బాలుర హైస్కూల్ విద్యార్థి మధు కిరణ్ 554 మార్కులు సాధించారు.



ఎంబి. గోవిందు (563) | తస్లీమా (563) | దనుంజయ రెడ్డి (538)



లిఖితారెడ్డి (539) | టి.శ్రావణి (569) | యు.పుష్పావతి (557)



కప్పట్రాళ్ల లావణ్య (547) | కె పావని (564) | బి పల్లవి (561)



జి భార్గవి (561) | త్రివేణి (555) | మధు కిరణ్ (554)

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: మండల పరిధిలోని దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ పూజారులు స్వామి వారికి సుప్రభాత సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకాలు, భండార్చన, పుష్పార్చాన, మహామంగళహారతి, ఆకుపూజ, నివేదన, నిరాజన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు. మొక్కుబడులున్న భక్తులు మోకాళ్లపై మెట్లను ఎక్కుతూ ప్రతి మెట్టుకు టెంకాయ కొట్టి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. భక్తులకు స్థానిక ఆస్పరి మఠంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు.



దేవరగట్టులో మాళమల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారులు

వ్యక్తిపై దాడి

నందవరం : మండల పరిధిలోని ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన బోయ పెద్ద ఈరన్న(45) అనే వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఆదివారం ఎస్‌ఐ మహేష్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు.. ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన బోయ పెద్ద ఈరన్న తన పొలంలో పని చేసిన కూలీలకు కూలి డబ్బులు పంపిణీ చేయాలని శనివారం ఇంట్లో నుంచి రూ.30 వేలు తీసుకుని బైక్‌పై మాచాపురంకి వెళ్లాడు. రాత్రి 7:30 గంటలకు ఈరన్న భార్య బోయ రాములమ్మకు ఇబ్రహీంపురం గ్రామ ఊరి బయట అప్పవారి కట్ట పొలం వద్ద రక్తగాయాలతో పడిఉన్నాడని సమాచారం అందింది. దీంతో ఆమె బంధులవుతో కలిసి వెళ్లి చూసింది. ఎలా జరిగిందని ఈరన్నను అడుగగా సైగలతో ఐదుగురు వ్యక్తులు దాడి చేశారని తెలిపాడు. అతన్ని చికిత్స నిమిత్తం వెంటనే ఎమ్మిగనూరు ఆసపత్రికి తరలించారు. వైద్యం అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈరన్న భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపటినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

10వ తేదీ వరకు ఫీజు చెల్లింపునకు గడువు

ఆదోని అర్బన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో 2, 4, 6 సెమిస్టర్లు చదువుతున్న విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 10వ తేదీ వరకు గడువు అని ఆ కేంద్రం కో–ఆర్డినేటర్ మురళీమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఈనెల 31వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఈనెల 31వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు 6వ సెమిస్టర్ పరీక్షలు, అదేవిధంగా వచ్చే నెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 4వ సెమిస్టర్ పరీక్షలు, 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 2వ సెమిస్టర్ పరీక్షలు ఉంటాయని చెప్పారు. మరిన్ని వివరాలకు విద్యార్థులు స్థానిక అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

దారికి అడ్డంగా గోడ

మద్దికెర : మండలపరిధిలోని పెరవలి గ్రామంలోని బీసీ కాలనీ సమీపంలో గతంలో ప్రైవేట్ వ్యక్తులు ప్లాట్లు వేసి విక్రయించారు. అయితే కొన్నేళ్లుగా కాలనీవాసులు ఆ దారి గుండా బీసీ కాలనీలోకి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఓ వ్యక్తి ఆ స్థలం నాకు విక్రయించారని రిజిస్ట్రేషన్ వుందంటూ గోడ కట్టించాడు. దీంతో గోడ కట్టినందువల్ల వచ్చిపోయేందుకు ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. గోడ తొలగించి రాకపోకలు సాగేలా చూడాలని కోరుతున్నారు.



రహదారికి అడ్డంగా గోడ కట్టిన దృశ్యం

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించండి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన పంటలైన కూరగాయలు, పండ్ల తోటల సాగు చేపట్టే విధంగా రైతులను ప్రోత్సహించాలని ఉద్యాన శాఖ కోడుమూరు డివిజన్ అధికారి మదన్‌మోహన్‌గౌడు సూచించారు. ఆయన ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమా కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. టమాట, బెండ, మిరప, ఉల్లి తదితర పంటల సాగులో పాటించాల్సిన ఆధునిక పద్ధతులను వివరించారు. మిరప పంటలో నారుమడి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కూరగాయల పంటల్లో తెగుళ్లు, పురుగుల యాజమాన్యం గురించి సూచనలు ఇచ్చారు. కూరగాయలు, పండ్లతోటల్లో సాధ్యమైనంత వరకు కెమికల్స్ వాడకాన్ని తగ్గించాలని, పశువుల ఎరువులు, కంపోస్టు ఎరువులు వినియోగించాలని కోరారు. ఉద్యాన పంటల్లో అధికోత్పత్తి సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వివిధ చీడపీడలను తట్టుకునే విత్తనాలను ఎంపిక చేసుకోవాలని, విత్తనశుద్ధి అత్యవసరమని, మొక్కల మధ్య తగిన దూరం పాటించాలని సూచించారు. తరచూ ఒకే పంట వేయరాదని, పంట మార్పిడి చేయాలన్నారు. రైతులకు సరైన సలహాలు, సూచనలు ఇచ్చి సహకరించాలని పేర్కొన్నారు. దేశీ శిక్షణా కార్యక్రమం సమన్వయకర్త, విశ్రాంత డీడీఏ నాగేంద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యాన అధికారి మదన్‌మోహన్ గౌడు

పింఛన్ల పంపిణీలో మద్దికెరకు రెండో స్థానం

మద్దికెర : సామాజిక పింఛన్లు పంపిణీ చేయడంలో జిల్లాలో మద్దికెర మండలం రెండవ స్థానంలో నిలిచిందని, ఇది అందరి కృషి వల్లే సాధ్యమయ్యిందని ఎంపీడీఓ నరసింహమూర్తి ఆదివారం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలలో వలంటీర్లు 1వ తేదీ తెల్లవారుజామున నుంచి పింఛన్ పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇతర గ్రామాల్లో ఉన్నా, ఆరోగ్యరీత్యా హాస్పిటల్లలో ఉన్నా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అక్కడికి వెళ్లి పింఛన్లు అందజేయడంతోనే ఇది సాధ్యమయిందన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మద్దికెర : స్థానిక ఆదర్శ పాఠశాలలో 2023- 24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 9వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ సవిత ఆదివారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 11వ తేదీన ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించి, అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రవేశం కల్పిస్తారని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు 'స్పందన'

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలు ఎవరైనా ఉంటే స్పందనలో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అలాగే ప్రతి రోజు గ్రామ సచివాలయాల్లో కూడా మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన ఉంటుందన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కారించాలన్నారు.

వర్మీ కంపోస్ట్‌తో అధిక దిగుబడులు

హొళగుంద: వర్మీ కంపోస్ట్ ఎరువుతో అధిక దిగుబడులు సాధించవచ్చని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. సర్పంచ్ చలవాది రంగమ్మ సహకారంతో గ్రామానికి ఆదాయ వనరులను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో సేకరించిన చెత్తతో పంచాయతీ ఆదాయం పెంచి గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు పడేలా చేస్తామన్నారు. వ్యవసాయంలో రసాయాన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువుల వినియోగానికి ప్రోత్సహించడానికి తమవంతు కృషి చేస్తామని చెప్పారు. వర్మి కంపోస్ట్ ఎరువును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థికి సన్మానం



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న కనకశ్రీ యూత్ సభ్యులు

హొళగుంద: నెరణికి గ్రామానికి చెందిన విద్యార్థి శ్రీకాంత్‌ను ఆదివారం కనకశ్రీ యూత్ సభ్యులు ఎస్కేగిరి, మరిమల్ల, రమేశ్ తదితరులు సన్మానించారు. శ్రీకాంత్ ఇంగళదహాల్ హాస్టల్‌లో చదువుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 510 మార్కులు సాధించాడు. దీంతో యూత్ సభ్యులు నెరణికి గ్రామానికి వెళ్లి విద్యార్థిని సన్మానించి అభినందించారు.

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోండి

గోనెగండ్ల: ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందజేసే సూక్ష్మనీటి సాగు పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ మైక్రో ఇరిగేషన్, ఓఎస్‌డీ వైవీఎస్ ప్రసాద్, పంచాకులు ఉమాదేవి కోరారు. మండలంలోని పెద్దమరివీడు, కులుమాల గ్రామాల్లో బొప్పాయి, మిరప పంటలను ఆదివారం పరిశీలించారు. కల్లాల్లో ఆరబెట్టిన పండు మిరపను పరిశీలించి రైతుల పంట దిగుబడి, ఆరబెట్టుకునే విధానం, పంటకోతలు, అమ్మకం జరిపే విధానాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అకాల వర్షాల వల్ల పంట ఉత్పత్తులను కాపాడుకునే పద్ధతులను రైతులకు వివరించారు. అలాగే పురుగులు, తెగుళ్ల వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం వేముగోడు గ్రామంలో మిరప పంటలలో సూక్ష్మనీటి సాగు పథకం ద్వారా రాయితీపై అమర్చిన డ్రిప్ పరికరముల వినియోగాన్ని పరిశీలించి, డ్రిప్ వినియోగంపై రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీడీ రాజాకృష్ణారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి రామాంజినేయులు, ఎమ్మిగనూరు ఉద్యాన శాఖ శ్రీవాణి, ఎంపీడీసీ జయరామిరెడ్డి, విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దమరివీడులో దెబ్బతిన్న బొప్పాయి తోటను పరిశీలిస్తున్న అధికారులు

ఎమ్మిగనూరురూరల్: రైతులు సూక్ష్మ నీటి సాగు పథకాలకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని ఉపయోగించుకోవాలని రాష్ట్ర సూక్ష్మ నీటి సాగు పథకం ఓఎస్‌డీ వై.వి.ఎస్. ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గువ్వలదొడ్డి, కందనాతి, మాసుమాన్‌దొడ్డి, గోనెగండ్ల మండలం హెచ్.కైరవాడి, కులమాల, పెద్దమర్రివీడు గ్రామాల్లో వర్షాల కారణంగా దెబ్బ తిన్న మిరప, పండ్ల తోటలు, డ్రిప్ ఇరిగేషన్ ఆయన పరిశీలించారు. వర్షాల కారణంగా మిరప, పండ్ల తోటలకు ఎంత నష్టం వాటిల్లిందో తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిక అందచేస్తామని చెప్పారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

ఆలూరు రూరల్/ చిప్పగిరి: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం శాఖ గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం అనే వేసవి శిక్షణ శిబిరం నిర్వస్తున్నట్లు ఆలూరు, మొలగవల్లి, చిప్పగిరి గ్రంథాలయాల అధికారులు వెంకటేశ్వర్లు, భాస్కర్, రసూల్ ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి జూలై 11వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇందు కోసం గ్రంథాలయాల్లో అన్ని రకాల పుస్తకాలు అందుబాటు ఉంచామన్నారు. విద్యార్థులకు గ్రంథాలయం సందర్శన, పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్ వంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గోనెగండ్లలో 40.6 మి.మీ వర్షపాతం

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రాత్రి కురిసిన వర్షానికి 40.6 మీల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వారం రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షానికి పొలాలు పదును కావడంతో రైతులు పొలం పనులు మొదలు పెడుతున్నారు. బావులు, బోర్లు దగ్గర ముందస్తు పొలం పనులు చేసుకున్న రైతులు పంటలు సాగుచేసుకుంటున్నారు. మరికొంత మంది రైతులు పొలంలో విత్తనాలు వేసుకునేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. పంటల సాగులో అధికారుల సలహాలు తీసుకొని సాగుచేసుకుంటే మంచి దిగుబడులు పొందవచ్చునని ఏఓ రాజా కిషోర్ తెలిపారు.

శ్రీ మాతా పరమేశ్వరీ జాతర ప్రారంభం

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఎంఎం కాలనీలో వెలిసిన శ్రీ మాతా పరమేశ్వరిదేవి ఆలయ 35వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి గణపతి, కుమారస్వామి, నవగ్రహ, అష్టదిక్పాలక పూజలు, గోపూజ, పంచామృతాభిషేకం తదితర పూజలు జరిగాయి. సోమవారం శివపార్వతులకు అభిషేకం, అర్చన, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి పురవీధులగుండా పల్లకీసేవ, భజన కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. అదేవిధంగా మంగళవారం అమ్మవారికి విశేషాలంకరణ, అభిషేకాలు, అర్చనలు, సాయంత్రం పురవీధుల్లో అమ్మవారి రథోత్సవం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.



ఎమ్మిగనూరు డీఎస్పీని కలిసిన ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం రూరల్: ఎమ్మిగనూరు డీఎస్పీగా నియమితులైన సీతారామయ్యను వైఎస్సార్‌సీపీ యువనేత ప్రదీప్‌రెడ్డి ఆదివారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని శాంతి భద్రతల విషయంపై డీఎస్పీతో చర్చించారు. డీఎస్పీని కలిసిన వారిలో ఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, మంత్రాలయం మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, పెద్దకడబూరు మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, సేవాదల్ నాయకుడు లక్ష్మినారయణరెడ్డి తదితరులు ఉన్నారు.



డీఎస్పీ సీతారామయ్యను కలిసిన యువనేత వై.ప్రదీప్‌రెడ్డి